క్లుప్తంగా

ప్రతి గడపలో సంక్షేమ కాంతులు



సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆదోనిరూరల్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం సంతోషంగా ఉందని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శేషిరెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కల్లుపోతుల సురేష్ అన్నారు. మంగళవారం మండిగిరిలోని తిరుమలనగర్‌లో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 99 శాతం హామీలను అమలు చేసినట్లు తెలిపారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలపాలని కోరారు.

మార్కెట్లకు వేలాలు

మంత్రాలయం: మంత్రాలయం పంచాయతీ పరిధిలోని మార్కెట్లకు మంగళవారం వేలాలు నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, ఈఓపీ ఆర్‌డీ ప్రభావతి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు నేతృత్వంలో వేలాలు చేపట్టారు. రోజువారి మార్కెట్‌ను మాణిక్యం నరసయ్య రూ.94 వేలు, వారపు సంత మార్కెట్‌ను యేసేబు రూ.49 వేలకు హెచ్చుపాడి దక్కించుకున్నారు.

ఆదోనిలో పోలీసుల కవాతు



ఆదోనిఅర్బన్: డీఎస్పీ శివనారాయణస్వామి ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు మంగళవారం ఆదోని పట్టణంలో కవాతు నిర్వహించాయి. రానున్న ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సెంట్రల్ ఫోర్స్ పోలీసులతో పట్టణంలోని భీమాస్ సర్కిల్, చాంద్‌సా దర్గా, మండిగిరి, ఇందిరానగర్, రాజీవ్‌గాంధీనగర్, ఆర్టీసీ కాలనీ, ఎస్‌కేడీ కాలనీ వరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌బీ అసిస్టెంట్ కమాండెంట్ రాజేష్, వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్ సీఐలు తేజమూర్తి, గోపీచంద్, నరసింమరాజు పాల్గొన్నారు.

ఆదోనిరూరల్: మండలంలోని సంతెకూడ్లూరు, పెద్దహరివాణం గ్రామాల్లో ఆదోని రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కవాతు చేసినట్లు సీఐ తెలిపారు.


మద్యం స్వాధీనం.. ముగ్గురి అరెస్ట్



పట్టుబడిన మద్యంతో ఎస్ఐ పీరయ్య

ఆదోనిరూరల్: ఆర్టీసీ బస్సులో కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు పెద్దతుంబళం ఎస్ఐ పీరయ్య తెలిపారు. మంగళవారం ఆదోని పట్టణంలోని వాల్మీకినగర్‌కు చెందిన బోయ నాగరాజు, బోయ సురేష్, బోయ శేఖర్ ఏడు బాక్సుల్లో 672 టెట్రా ప్యాకెట్లును తరలిస్తుండగా పెద్దతుంబళం గ్రామ శివారులోని కోసిగి క్రాస్ రోడ్డు వద్ద పట్టుకున్నామని చెప్పారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ గోపాల్, పోలీసులు భీరప్ప, బంగారప్ప పాల్గొన్నారు.

రేపు కార్మిక సంఘాల నిరసన ప్రదర్శన



కరపత్రాలను విడుదల చేస్తున్న సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు

ఆదోనిరూరల్: ఈనెల 14వ తేదీ రైతులు చేపట్టిన చలో ఢిల్లీకి మద్దతుగా ఆదోని పట్టణంలో రైతు కార్మిక సంఘాల నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వీరన్న, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్‌బాబు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆదోనిలో కరపత్రాలను విడుదల చేశారు. కార్మిక సంఘం నాయకులు కె.లింగన్న, తిప్పన్న, నరసప్ప, యల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

టీబీ డ్యాంలో 6 టీఎంసీలకు తగ్గిన నీరు

హొళగుంద: ఉమ్మడి రిజర్వాయర్ కర్ణాటకలోని తుంగభద్ర జలాశయంలో మంగళవారం నీటి నిల్వ 6.5 టీఎంసీలకు తగ్గింది. గత నెల 19న ఎల్లెల్సీకి ఏపీ కోటా నీటిని విడుదల చేసిన టీబీ బోర్డు అధికారులు ఈ నెల 20వ తేదీన సరఫరా నిలిపి వేయనున్నారు. డ్యాంలో మంగళవారం 1584.20 అడుగుల వద్ద నీరు ఉండగా ఇన్‌ఫ్లో జీరో ఉండి అవుట్‌ఫ్లో 2,042 క్యూసెక్కులుంది. ఎల్లెల్సీ ఆంధ్ర పరిధి 250 కి.మీ వద్ద 480 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది.

మెరుగైన విద్యాబోధనకు 'స్విఫ్ట్ చాట్'

- ఐఎఫ్‌పీ, ట్యాబ్స్‌తో యాప్ అనుసంధానం
- ప్రతి టీచర్ మొబైల్‌లో యాప్ డౌన్‌లోడ్ చేసుకునే విధంగా చర్యలు
- ప్రభుత్వ విధానాలపై సర్వత్రా హర్షం



విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు (ఫైల్)



ట్యాబ్‌లోని స్విఫ్ట్‌చాట్ యాప్

ఆదోని సెంట్రల్: విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి, అభ్యసన సామర్థ్యాలను పెంపొందించే విధంగా ప్రభుత్వం డిజిటల్ విద్యను ప్రవేశపెట్టి విద్యలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్స్‌ను 8వ తరగతి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అందజేసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాఠశాల విద్యలో వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తోంది.

➡ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్, ప్రాథమిక పాఠశాలలో స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేసింది. వాటిని ఉపయోగించుకునే విధానంపై ఉపాధ్యాయులకు శిక్షణ కూడా ఇచ్చింది. డిజిటల్ విద్యను మరింత అభివృద్ధి చేసే చర్యల్లో భాగంగా 'స్విఫ్ట్ చాట్' యాప్‌ను ప్రవేశపెట్టింది. ఉపాధ్యాయులు తమ బోధనను మరింత మెరుగు పరుచుకునేందుకు ఈ యాప్‌ను వారి మొబైల్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

ఇలా ఇన్‌స్టాల్ చేసుకోవాలి

ప్లేస్టోర్‌లో ఏపీ టీచర్ బోట్‌ను ఎంపిక చేసుకుని 'స్విఫ్ట్ చాట్' యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. యాప్ ఓపెన్ అయిన తర్వాత రిజిస్టర్ మొబైల్ నంబర్‌ను ఎంటర్ చేసి విద్యాశాఖ నుంచి ఓటీపీని నమోదు చేయాలి, అనంతరం సంబంధిత స్కూల్ యూడైస్ కోడ్, ఉపాధ్యాయుడి సీఎఫ్ఎంఎస్ ఐడీ నమోదు చేయాల్సి ఉంటుంది.

➡ దీనిపై ఇప్పటికే సైన్స్, గణితం, బయాలజీ ఉపాధ్యాయులకు ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీపై ఒక రోజు ఓరియంటేషన్ తరగతులను నిర్వహించారు. ముఖ్యంగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెంట్ అసిస్టెంట్ ఫర్ టీచర్స్, చాట్ జీపీటీ వంటి యాప్స్‌తో పాటు స్విఫ్ట్ చాట్ వంటి పలు వెబ్‌సైట్లపై అవగాహన కల్పించారు. ఆదోని పురపాలక, ప్రభుత్వ పాఠశాలల్లో గణితం, ఫిజికల్ సైన్స్, బయాలాజికల్ సైన్స్ టీచర్లకు ఒక రోజు ఓరియంటేషన్ తరగతులను నిర్వహించారు. ఇప్పటికే పాఠశాలలకు సరఫరా చేసిన ఐఎఫ్‌పీలు, బైజూస్ ట్యాబ్స్‌లో ముందుగానే స్విఫ్ట్ చాట్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేశారు.

స్విఫ్ట్ చాట్ అంటే..

బోధనలో భాగంగా తెలియని అంశాన్ని వాట్సాప్ చాట్ మాదిరిగానే స్విఫ్ట్ చాట్‌లో ఎస్ఎంఎస్ చేస్తే క్షణాల్లో సంబంధిత సమాచారం యాప్‌లో ప్రత్యక్షమవుతుంది. ఈ యాప్‌లో 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకు డిజిటల్ పాఠ్యాంశాలు, లైవ్ క్విజ్‌లు, కాంపిటీషన్ జోన్, స్కిల్ కార్నర్‌లు రివార్డులను పొందుపర్చారు. నచ్చిన ఐటమ్స్‌ను స్టోర్ చేసుకునే అవకాశం యాప్‌లో ఉంది. ప్రస్తుతం 1, 2 తరగతులకు సంబంధించి గణితం, మూడు నుంచి ఆరు తరగతుల వరకు గణితం సైన్స్ సబ్జెక్టులపై మాత్రమే డిజిటల్ తరగతులు, క్విజ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఉపాధ్యాయుడు బోధన చేసే సమయంలో విద్యార్థులకు సబ్జెక్టు పరంగా సమగ్రమైన జ్ఞానాన్ని అందిచాల్సి ఉంటుంది. మిగిలిన సబ్జెక్టులపై కూడా భవిష్యత్తులో డిజిటల్ తరగతులను పొందపర్చనున్నారు.



ఐఎఫ్‌పీ ప్యానల్స్ ద్వారా విద్యను అందిస్తున్న ఉపాధ్యాయుడు

రిజిస్ట్రేషన్ చేసుకున్నారు



ఉపాధ్యాయులు మొబైల్ ఫోన్లలో స్విఫ్ట్ చాట్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని రిజిస్టర్ చేసుకున్నారు. దాదాపు 98 శాతం మంది ఉపాధ్యాయుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి కావొచ్చింది. ఈ యాప్ అందరికీ ఉపయోగకరంగా ఉంటుంది. ఎవరైనా ఇంకా స్విఫ్ట్ చాట్ యాప్ రిజిస్టర్ చేసుకోకపోతే తప్పకుండా చేసుకోవాలి. మనకు అర్థం కాని విషయాలు తెలుసుకొనేందుకు ఈ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుంది.

– రాజేంద్రప్రసాద్, మండల విద్యాధికారి, ఆదోని

కురువలకు రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాలి

ఆదోని అర్బన్: కర్నూలు జిల్లాలో సుమారు 5 లక్షల మంది కురువ ఓటర్లు ఉన్నారని, అసెంబ్లీ, ఎంపీ టికెట్లను కేటాయించాలని కురువ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుడిసె శివన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆదోనిలో విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాలో ఎంపీ, ఎమ్మెల్యే సీట్ల కేటాయింపుల్లో కురువలకు స్థానం కల్పించకపోతే జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో స్వతంత్ర్య అభ్యర్థులుగా పోటీలో ఉంటామని చెప్పారు. ఏ పార్టీ కేటాయిస్తుందో ఆ పార్టీకే కురువలు పూర్తిస్థాయి మద్దతు ఉంటుందన్నారు.

5 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బియ్యం బస్తాలతో అధికారులు

ఆదోనిరూరల్: పేదలకు సరఫరా చేస్తున్న రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఆదోని–ఆస్పరి రోడ్డులోని బైపీఆర్ కాలనీ వద్ద రెండు వాహనాల్లో రేషన్ బియ్యం ఉన్నట్లు పక్కా సమాచారం మేరకు విజిలెన్స్ సీఐ రామకృష్ణ, తన సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. మొత్తం 5.2 టన్నుల పీడీఎస్ బియ్యాన్ని, రెండు మినీ ట్రక్కులను సీజ్ చేశారు. వాటిని తాలూకా ఎస్ఐ ఎర్రిస్వామికి అప్పగించినట్లు చెప్పారు. దాడుల్లో డిప్యూటీ తహసీల్దార్ వలీబాషా పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పాలన దేశానికే ఆదర్శం

- మండలంలో రూ.409.41 లక్షలతో నూతన భవనాలు నిర్మాణం
- ప్రారంభించిన టీటీడీ పాలక మండలి సభ్యుడు వై.సీతారామి రెడ్డి



తారాపురంలో ఓహెచ్ఎస్ఆర్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న వై.సీతారామిరెడ్డి

పెద్దకడబూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన దేశానికే ఆదర్శమని తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యుడు వై.సీతారామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని దొడ్డిమేకల, కల్లుకుంట, కంబలదిన్ని, నాగులాపురం, బసలదొడ్డి, చిన్నకడబూరు, తారాపురం గ్రామాలలో మంగళవారం సర్పంచ్‌లు చంద్రశేఖర్, ఇస్మాయిల్, తిమ్మక్క, చంద్రిక, బుడ్డ అంజనమ్మ, అనసూయమ్మ, లక్ష్మమ్మ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. దొడ్డిమేకల గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయంను ప్రారంభించి పార్టీ అవిర్భావం సందర్భంగా కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. కల్లుకుంట గ్రామంలో జలజీవన్ మిషన్ కింద రూ.116.48 లక్షలతో 1.20 లక్షల లీటర్ల సామర్థ్యంతో నిర్మించిన ఓహెచ్ఎస్ఆర్, మండల గ్రాంట్ కింద రూ.5 లక్షలతో డ్రైనేజీ ఏర్పాటుకు భూమిపూజ, ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఎగరవేశారు. కంబలదిన్నిలో రూ.20.80 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం, రూ.20.90 లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్, నాగులాపురంలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ.20.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, జలజీవన్ మిషన్ కింద రూ.26.50 లక్షలతో 40 వేల లీటర్ల సామర్థ్యం గల ఓహెచ్ఎస్ఆర్, బసలదొడ్డి గ్రామంలో జలజీవన్ మిషన్ కింద రూ.42.91 లక్షల వ్యయంతో 90 వేల లీటర్ల సామర్థ్యంతో ఓహెచ్ఎస్ఆర్, చిన్నకడబూరులో జలజీవన్ మిషన్ కింద రూ.30.64 లక్షలతో 60 వేల లీటర్ల సామర్థ్యంతో ఓహెచ్ఎస్ఆర్‌ను ప్రారంభించారు. చివరగా తారాపురంలో గిడ్డాంజనేయ స్వామికి పూజలు నిర్వహించి అక్కడ జలజీవన్ మిషన్ కింద రూ.50.38 లక్షలతో 90 వేల లీటర్ల సామర్థ్యంతో ఓహెచ్ఎస్ఆర్‌ను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. వైఎస్ జగనన్న చేసిన మేలును మరువకుండా రానున్న ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండలాధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి, ఎంపీపీ శ్రీవిద్య, జెడ్పీటీసీ రాజేశ్వరి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, రవిచంద్రరెడ్డి, రామాంజినేయులు, రఘురాముడు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ ప్రభాకర్, ఏఓ వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



కల్లుకుంట గ్రామంలో సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న వై.ప్రదీప్‌రెడ్డి

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్సీ మధుసూదన్, యువనేత జయమనోజ్ రెడ్డి
- వైఎస్సార్ చేయూత చెక్కుల పంపిణీ



హాజరైన మహిళలు



చేయూత మెగా చెక్కును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ మధుసూదన్, జయమనోజ్ రెడ్డి

ఆదోనిరూరల్: మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే కుటుంబం బాగుంటుందని వారి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని.. ముఖ్యంగా జగనన్న చేయూత పథకం మహిళలకు వరం లాంటిదని ఎమ్మెల్సీ మధుసూదన్, ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తనయుడు, యువనేత జయమనోజ్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మహేశ్వరి కల్యాణ మండపంలో 'వైఎస్సార్ చేయూత' నాలుగో విడత కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన వారు మెగా చెక్కును విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 6,617 మంది లబ్ధిదారులకు రూ.12.41 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. మహిళలు ఆర్థికంగా రాణించేలా జగనన్న ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సకాలంలో మహిళలకు డబ్బులను అందించి వారు ఆర్థికంగా రాణించేలా ప్రోత్సహిస్తున్నారన్నారు. మహిళలు చిరు వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థికంగా నిలదొక్కుకోవాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించుకుందామని, జగన్‌మోహన్ రెడ్డిని సీఎంను చేసుకుందామని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ, ఎంపీడీఓ, నాయకులు చంద్రకాంత్‌రెడ్డి, గురునాథ్‌రెడ్డి, ఏపీఎం జనార్దన్, సీసీలు తిక్కన్న, రవికుమార్, రామన్న, సౌజన్య, నాగలక్ష్మి, నల్లన్న తదితరులు పాల్గొన్నారు.

దేవర ప్రారంభం



మారెమ్మవ్వకు అడుగడుగునా పూజలు

కౌతాళం: మండల కేంద్రంలో దేవర ఉత్సవాలు మంగళవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. 9 సంవత్సరాల తర్వాత దేవర జరుగుతుండడంతో గ్రామంలో సంబరాలతో ప్రతి ఇల్లు కళకళలాడుతోంది. ఆచారుల ఇంటి నుంచి విగ్రహాల ఊరేగింపు వైభవంగా ప్రారంభం అయ్యింది. ఈ ఊరేగింపు రాత్రి 10 గంటల వరకు సాగగా ఉత్సవమూర్తులు స్థానంలో కూర్చున తర్వాత రాత్రి 12 గంటలకు మేటి కుంభంతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయని నిర్వాహకులు తెలిపారు. ఇప్పటికే విద్యుత్ దీపాలతో మారెమ్మ ఆలయం, సుంకులమ్మ ఆలయం, రామక్కమ్మవ్వ ఆలయాలను సుందరంగా అలంకరించారు. గ్రామదేవత పండుగ కావడంతో గ్రామంలోని ప్రతి ఇల్లు దేవర సంబరాలకు సిద్ధంగా ఉన్నాయి. ఉత్సవాలను గ్రామస్తులంతా కలిసి కట్టుగా భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కమిటీ నిర్వాహకులు సూచించారు.

జగనన్నను మరోమారు సీఎంను చేసుకుందాం

- ఆదోనిలో ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం



ఆదోనిలో బైక్ ర్యాలీ



పార్టీ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ మధుసూదన్

ఆదోని టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి సీఎంను చేసుకుందామని ఎమ్మెల్సీ మధుసూదన్, పార్టీ పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతిదీవెన, గోరుముద్ద, జగనన్న చేదోడు, జగనన్న చేయూత, పొదుపు సంఘాల మహిళలకు సున్నావడ్డీ, ఆరోగ్యశ్రీ, 108, 104 తదితర సంక్షేమ పథకాలు పేదలకు చేరాలంటే వైఎస్సార్‌సీపీని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. మంగళవారం ఆదోని నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఎస్‌కేడీ కాలనీలోని పార్టీ కార్యాలయం వద్ద ఎమ్మెల్సీ మధుసూదన్, చంద్రకాంత్‌రెడ్డి పార్టీ జెండాను ఎగురవేశారు. అక్కడి నుంచి బైక్ ర్యాలీగా ప్రధాన రోడ్లు, భీమాస్ సర్కిల్ మీదుగా గోస్ ఆస్పత్రి రోడ్డులోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్దకు చేరుకుని నివాళులర్పించారు. మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాలతో పుట్టుకొచ్చిన పార్టీ వైఎస్సార్‌సీపీ అని అన్నారు. పేదల గుండెల్లో చెరగని స్థానాన్ని సంపాదించుకున్న నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. జగనన్నకు వస్తున్న ఆదరణ, సంక్షేమం, అభివృద్ధి పనులను చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు కుట్రలు, కుతంత్రాలు పన్నుతూ బురదజల్లుతున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో దేవా, సింహం నాగేంద్ర, తిమ్మప్ప, లక్ష్మన్నరావు, కౌన్సిలర్ ఫయాజ్‌అహ్మద్, పోలీసు, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పోలకల్ రేణుక, నాయకులు గంగాధర్, రామకృష్ణ, కుంకనూరు వీరేష్, హుసేనప్ప, తాయన్న, ఎంపీటీసీ ఉరుకుంద, హెచ్.తాయన్న, శ్రీనివాసులు, మునీర్‌అహ్మద్, అబ్దుల్‌రహమాన్, కౌన్సిలర్ అశోక్, లక్ష్మి నారాయణ, లక్ష్మన్న, తిక్కన్న పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందిస్తున్న మురళీమోహన్ రెడ్డి

కోసిగి: విద్యార్థులు కష్టపడి చదవి పదో తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీమోహన్ రెడ్డి సూచించారు. మండలంలోని జంపాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం హెచ్ఎం అరుణ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులు 84 మందికి పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. ఎలాంటి భయం లేకుండా పరీక్షలు రాయాలన్నారు. రూ.6 వేలు విలవచేసే పరీక్షా సామగ్రిని ఉపాధ్యాయులతో కలసి అందజేశారు. గ్రామ నాయకులు బసిరెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

మంత్రాలయం మీదుగా వందే భారత్ రైళ్లు



రైలు ప్రారంభం సందర్భంగా ర్యాలీ చేస్తున్న రైల్వే అధికారులు, విద్యార్థులు

మంత్రాలయం: మంత్రాలయంరోడ్ రైల్వేస్టేషన్ మీదుగా వందే భారత్ రైళ్ల రాకపోకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా రైల్వే శాఖ ఆధ్వర్యంలో వందేభారత్ రైళ్ల సర్వీసులను ప్రారంభించారు. కర్ణాటకలోని కలబురిగి (గుల్బర్గా) నుంచి బెంగళూరుకు సర్వీసులు నడపనున్నారు. శుక్రవారం మినహా 22231 నంబరుగల వందేభారత్ రైలు కలబురిగి నుంచి బెంగళూరుకు నడుస్తుంది. అలాగే గురువారం మినహా 22232 వందేభారత్ రైలు బెంగళూరు నుంచి కలబురిగి వరకు సర్వీసు ఉంటుంది. రైలు ప్రారంభం సందర్భంగా స్థానిక రైల్వేస్టేషన్ జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో వైఎస్సార్‌సీపీ కోసిగి మండల ఇన్‌చార్జ్ మురళీమోహన్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ర్యాలీలో మాట్లాడుతూ వందేభారత్ రైళ్లు అందుబాటులోకి రావడంతో రాఘవేంద్ర స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు.

సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న మురళీరెడ్డి

కోసిగి: మండల కేంద్రంలోని సిద్దప్పపాలెం 1వ వార్డులో రూ.5 లక్షల పంచాయతీ నిధులతో సిమెంటు రోడ్డు డ్రైనేజీ పనులను వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీమోహన్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి కోసిగి అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించడంతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కోసిగిలో రూ.3 కోట్లకు పైగా నిధులతో సిమెంటు రోడ్లు, డ్రైనేజీలను వాడవాడలా ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. ఎంపీపీ ఈరన్న, నాయకులు మాణిక్‌రాజు, మంగమ్మ, బసిరెడ్డి, కోసిగయ్య, మల్లయ్య, రాజేష్, కోరివి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అతిగా మందులు వాడితే కిడ్నీలపై ప్రభావం



మాట్లాడుతున్న ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసనాయక్

ఆదోనిఅర్బన్: వైద్యుడి సలహాల మేరకే మందులు వాడాలని, స్వతహాగా పెయిన్ కిల్లర్ వాడి మూత్రపిండాలకు ప్రమాదాన్ని కొని తెచ్చుకోవద్దని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసనాయక్, వైద్యుడు రవికుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ప్రపంచ మూత్రపిండాల దినోత్సవాన్ని పురస్కరించుకుని రోగులు, ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. మూత్రపిండాల పనితీరు, వాటి రక్షణపై అవగాహన కల్పించారు. ఇష్టానుసారం మందులు వాడితే కిడ్నీ సమస్యకు గురవుతుందన్నారు. ఏపీ, తెలంగాణ క్వాలిటీ మేనేజర్ రాజు మాట్లాడుతూ.. దేశంలో 135 డయాలసిస్ క్లీనిక్‌లు ఉన్నాయని, నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా డయాలసిస్ ఉచితంగా చేస్తున్నారని తెలిపారు. పట్టణంలోని డయాలసిస్ క్లీనిక్‌లో 90 మంది పేషెంట్లు ఉన్నారని, నెలకు 1000 మందికి చికిత్స చేస్తున్నట్లు వెల్లడించారు. 2022లో బెస్ట్ డయాలసిస్ క్లీనిక్ అవార్డు ఆదోనికి వచ్చిందన్నారు. వైద్యుడు రాజకిరీటీ, సిబ్బంది మోహన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మానవీయ విలువలకు దర్పణం రామాయణం



పూజలందుకుంటున్న ఆంజనేయస్వామి

పెద్దకడబూరు: శ్రీమద్రామాయణం మానవీయ విలువలకు ప్రతీకగా నిలుస్తుందని తిరుమల తిరుపతి దేవస్థానముల హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని హెచ్.మురవణి గ్రామంలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ స్థానిక భజన మండలిచే భజనలు, బ్రహ్మచారి జయదేవానంద స్వామిచే మూడు రోజుల పాటు శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతపై ధార్మిక ప్రవచనాలు, శుక్రవారం గోపూజ, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భజన మండలి అధ్యక్షుడు నంబి నరసింహామూర్తి, గోవిందు, శ్రీశైలాచారి, ఈరన్న, కృష్ణ, భూమిక, హనుమంతు, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ



ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి శైలజ

ఆదోనిటౌన్: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 19వ వార్డుకు చెందిన 30 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సతీమణి శైలజ మంగళవారం ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన లబ్ధిదారులందరికీ ఇళ్ల పట్టాలను అందజేశారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని, ఆదోని ఎమ్మెల్యేగా సాయిప్రసాద్‌రెడ్డిని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మధుబాబు, నాయకులు వెంకటేష్, వీరేష్, దుర్గేష్, గంజులయ్య, నరసింహులు, మాని నరసయ్య, మారెప్ప, బాలరాజు పాల్గొన్నారు.